క్లుప్తంగా

ఓటర్ల జాబితా పకడ్బందీగా సిద్ధం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామేశ్వరరావు

బనగానపల్లెరూరల్: ఓటరు జాబితా తప్పులు లేకుండా పకడ్బందీగా సిద్ధం చేయాలని బనగానపల్లె నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కామేశ్వరరావు సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఓటర్ల జాబితాపై వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆర్‌ఓ మాట్లాడారు. వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు తమకు కేటాయించిన ఓటర్ల జాబితాను ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ఆయా గృహాల్లో ఎంత మంది ఓటర్లు ఉన్నారు తదితర వివరాలను సేకరించాలన్నారు. ఒక ఓటర్‌కు వేర్వేరు ప్రాంతాల్లో డబుల్ ఎంట్రీగా ఉంటే వెంటనే తొలగించి, ఒక చోటు మాత్రమే ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో లేని, మృతి చెందిన ఓటర్లకు సంబంధించి ముందుస్తు నోటీసు ఇచ్చి వివరాలను పొందుపరచి ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ పవన్ కుమార్‌రెడ్డి, ఏఎస్‌ఓ వెంకట్రామిరెడ్డి, ఆర్‌ఐ రాఘవేంద్రప్రసాద్,రెవెన్యూ సిబ్బంది ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

1న ఆర్టీసీ బస్టాండ్‌ను ప్రారంభించనున్న మంత్రి

బేతంచెర్ల: బేతంచెర్ల పట్టణంలో రూ.1.33 కోట్లతో నిర్మించిన ఆర్టీసీ బస్టాండును సెప్టెంబర్ 1వ తేదీన మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రారంభిస్తారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. రూ.1.33 కోట్లతో నిర్మించిన బస్టాండ్ ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు మంత్రి ప్రారంభిస్తారని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

మంత్రి బుగ్గన నేటి పర్యటన వాయిదా

మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం పర్యటన వాయిదా పడిందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి బుధవారం తెలిపారు. దీంతో పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీలలో నిర్మించిన సచివాలయ ప్రారంభోత్సవం ఉండదని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గమనించాలని కోరారు.

ఎర్రబోతుల మూడో వర్ధంతి ఏర్పాట్లు

కొలిమిగుండ్ల: దివంగత వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రబోతుల వెంకటరెడ్డి మూడో వర్ధంతికి ఏర్పాట్లు చేస్తున్నారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఉదయ్‌భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2వ తేదీన నాయినపల్లె-పెట్నికోట గ్రామాల మధ్యనున్న గుండుమల్లేశ్వరస్వామి ఆలయ ఆవరణలో వర్ధంతి వేడుకలు నిర్వహించనున్నారు. ఎర్రబోతుల చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పెద్ద ఎత్తున ప్రజలకు అన్నదానం నిర్వహించనున్నారు. రాత్రికి సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు. వర్ధంతి కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని ఎర్రబోతుల సోదరులు పేర్కొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగితే చర్యలు

బేతంచెర్ల: ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని అంబుడ్స్ పర్సన్ సురేంద్రకుమార్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని యంబాయి, శంకరాపురం గ్రామ పంచాయతీల్లో పండ్లతోటలను ఆయన పరిశీలించారు. రైతులతో ఆయన మాట్లాడుతూ మొక్కలుగా సక్రమంగా పెంచితే మూడేళ్లపాటు నిర్వహణ ఖర్చులు, నీటి వసతి ఇవ్వడం జరుగుతుందన్నారు.అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్స్ సమావేశం నిర్వహించారు. ఉపాధి కూలి సగటును రూ.272 పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శేషన్న, టెక్నికల్ అసిస్టెంట్ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, చలంరెడ్డి

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపాన మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో వాల్మీకి కమ్యూనిటి హాల్ నిర్మాణానికి రూ. 2కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు చేపట్టిన పనులను బుధవారం ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి పరిశీలించారు. పనులు పురోగతిపై కాంట్రాక్టర్‌తో చర్చించిన వారు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సా ర్ నాయకులు బుగ్గన కుమార్‌రెడ్డి, తిరుమలేశ్వర్ రెడ్డి, ఎద్దులన్న, రామనాయుడు పాల్గొన్నారు.

తీరిన ఏళ్లనాటి సమస్య!

- శ్మశానవాటికలకు రక్షణ గోడలు
- ప్రహరీ నిర్మాణాలకు రూ. 1,24,85,000 కేటాయింపు
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో శ్మశానవాటికకు నిర్మించిన ప్రహరీ



సిమెంట్ నగర్ గ్రామంలో ముస్లిం శ్మశానవాటికకు నిర్మించిన రక్షణ గోడ

బేతంచెర్ల: ప్రజా సంక్షేమం, అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యనిస్తుంది. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, నీటి వసతి, పొలాలకు రహదారులు ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం శ్మశాన వాటికలలో మౌలిక వసతులపై దృష్టి సారించింది. మృతదేహాలను ఖననం చేసేందుకు ఆరడుగుల స్థలం లేక పాత సమాధినే తవ్వి అంతిమ సంస్కారాలు నిర్వహించే పరిస్థితి. ఏళ్ల తరబడి ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరువతో శ్మశానాల అభివృద్ధికి రూ. 1,24,85,000 మంజూరు చేయించారు. ఈ మేరకు చేపట్టిన అభివృద్ధి పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయి. బేతంచెర్ల మండలంలో 19 గ్రామ పంచాయతీలు, 14 మజార గ్రామాలు ఉన్నాయి. ఇందులో బేతంచెర్ల నగర పంచాయతీ పరిధిలో బేతంచెర్లతో పాటు బుగ్గానిపల్లె గ్రామం ఉంది. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో మొత్తం 16 శ్మశాన వాటికల్లో అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం డీఎంఎఫ్ నిధులు, నగర పంచాయతీలో మూడు శ్మశాన వాటికలను నగర పంచాయతీ నిధులు కేటాయించింది. ఒక్కో శ్మశానవాటికకు రూ. 4.90 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. ఇందులో 12 స్మశాన వాటికల నిర్మాణాలు పూర్తికాగ యంబాయి, ఆర్ కొత్తపల్లె, కే. కొట్టాల, బేతంచెర్ల పట్టణంలో రెండు స్మశాన వాటికల పనులు కొనసాగుతున్నాయి. ముసలాయిచెర్వు, బలపాలపల్లె గ్రామాల్లో నిర్మాణాలు ప్రారంభం కావాల్సి ఉంది. శ్మశానవాటికకు ఆక్రమణలు తొలగించి ప్రహరీ ఏర్పాటు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చచ్చినా... పూడ్చేందుకు చావే!

ఏళ్లతరబడి కనీసం మరమ్మతులకు నోచుకోకపోవడంతో శ్మశానవాటికలు అస్తవ్యస్థంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో ఆక్రమణలకు గురయ్యాయి కూడా. మరికొన్ని శ్మశానాల్లో మృతదేహాన్ని పూడ్చేందుకు నానా తంటాలు పడాల్సిన పరిస్థితి. స్థలంలేక పూడ్చిన స్థలంలోనే మళ్లీ ఖననం చేయాల్సిన దుస్థితి నెలకొంది. చచ్చినా పూడ్చేందుకు చావే అనే దుస్థితి. ఈ సమస్యలను గుర్తించిన మంత్రి బుగ్గన ప్రత్యేక చొరువతో నిధులు మంజూరు చేయించారు. ఎట్టకేలకు ఏళ్లతరబడి నెలకొన్న సమస్యలు తీరడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో శ్మశానవాటికల అభివృద్ధికి నిధులు

గ్రామం	పని విలువ లక్షల్లో		
గూటుపల్లె	రూ. 12 లక్షలు	ముద్దవరం	రూ. 4.95 లక్షలు
సిమెంట్‌నగర్ (ముస్లీంశ్మశానవాటిక)	రూ. 10లక్షలు	గోరుమానుకొండ హిందూ	రూ. 4.90 లక్షలు
గోర్లగుట్ట	రూ. 10 లక్షలు	కే. కొట్టాల	రూ. 4.95 లక్షలు
బేతంచెర్లలో క్రిస్టియన్	రూ. 10 లక్షలు	ఎం.పేండేకల్లు	రూ.4.95 లక్షలు
బేతంచెర్ల కొలుములపల్లె రహదారిలో	రూ.8 లక్షలు	మర్రికుంట	రూ.4.95
బేతంచెర్ల,భైటిపేట	రూ.8 లక్షలు	బలపాలపల్లె	రూ.4.95
వీరాయపల్లె	రూ. 7.50 లక్షలు	భైనపల్లె	రూ.4.95
యంబాయి	రూ.4.95 లక్షలు	ఆర్ కొత్తపల్లె	రూ.4.95
		సీతారామాపురం	రూ.4.95
		ముసలాయిచెర్వు	రూ.4.90
		గోరుమానుకొండ. క్రిస్టియన్	రూ.4.90లక్షలు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ అభివృద్ధి పనులకు ప్రాధాన్యత నిస్తుంది. ఏళ్లతరబడి ఏ మాత్రం అభివృద్ధి నోచుకోని శ్మశానవాటికలను తీర్చిదిద్దాం. రూ. లక్షలు వెచ్చించి ప్రహరీలు నిర్మించాం. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయిస్తుండటంతో శ్మశానవాటికలకు ప్రహరీ నిర్మాణాలు చేపట్టాం. దాదాపు 90 శాతం శ్మశాన వాటికలకు రక్షణ గోడల నిర్మాణాలు పూర్తయ్యాయి.

– ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

శ్మశానవాటికల పరిస్థితి అధ్వానంగా ఉండేది



ఏళ్ల తరబడి శ్మశాన వాటికల పరిస్థితి అధ్వానంగా ఉండేది. కనీస మౌలిక వసతులు లేనందున ప్రజలు ఇబ్బందులు పడేవారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరువతో శ్మశానవాటికలలో మౌలిక వసతుల కల్పనకు నిధుదు మంజూరు చేయించారు. అంతిమ సంస్కారాలు నిర్వహించే ప్రదేశంలో కుక్కలు, పందులు సంచారం ఉండకూడదన్న ఉద్దేశంతో ప్రహరీ నిర్మాణాలు చేపట్టాం. ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి

త్వరలో ప్రహరీ నిర్మాణాలు పూర్తి చేస్తాం



మండలంలో 16 శ్మశానవాటికలకు డీఎంఎఫ్ నిధులు వెచ్చించి ప్రహరీ నిర్మాణ పనులు చేపడుతున్నాం. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ శ్మశానవాటికలకు ప్రహరీ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. నిర్మాణ దశలో ఉన్న పనులు కూడా త్వరితగతిన పూర్తయేలా చర్యలు తీసుకుంటాం. అదేవిధంగా శ్మశానవాటికలలో మౌలిక వసతులు కల్పిస్తున్నాం.

– గణేష్, పీఆర్‌ఏఈ

వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ముడియాల జయచంద్రారెడ్డి



అవుకు: అవుకు పట్టణానికి చెందిన ముడియాల జయచంద్రారెడ్డి నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ముడియాల సేవలకు గుర్తింపు లభించిందని పార్టీ శ్రేణులు పలువురు అభినందనలు తెలిపారు. దివంగత ఎమ్మెల్సీలు చల్లా రామక్రిష్ణా రెడ్డి, ఆయన తనయుడు చల్లా భగీరథ్ రెడ్డిని స్మరించుకుంటూ.. నాకు లభించిన గొప్పగుర్తింపుగా భావిస్తున్నానని ఈ సందర్భంగా ముడియాల జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి రుణపడి ఉంటానని, పార్టీ అభివృద్ధికి అంకిత భావంతో కృషి చేస్తానని చెప్పారు.

నిద్రమత్తులో కిందపడి ట్రాక్టర్ డ్రైవర్ మృతి



మృతుడు రమేష్‌గౌడ్

గుత్తి రూరల్: నిద్రమత్తులో తూలడంతో ట్రాక్టర్‌పై నుంచి కిందపడి డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు...నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లికి చెందిన వెంకటేష్ కుమారుడు రమేష్ గౌడ్ (23) ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి తన స్నేహితుడు హర్షవర్ధన్‌తో కలసి ప్యాపిలికి బండల లోడు తీసుకెళ్లాడు. అక్కడ అన్‌లోడ్ చేసిన వెంటనే తిరుగు ప్రయాణమయ్యాడు. బుధవారం ఉదయం గుత్తి మండలం వన్నేదొడ్డి శివారులోకి చేరుకోగానే 44వ జాతీయ రహదారిపై ట్రాక్టర్ నడుపుతున్న రమేష్‌గౌడ్ నిద్రమత్తులో తూలడంతో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పల్లంలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో రమేష్ గౌడ్ అదుపు తప్పి రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాలీలో ఉన్న హర్షవర్ధన్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న గుత్తి పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

జాతీయ లోక్ ఆదాలత్‌ను విజయవంతం చేయండి

- జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసులు

డోన్ టౌన్ : సెప్టెంబర్ 9వ తేదీన నిర్వహిస్తున్న జాతీయ మెగా లోక్ అదాలత్ విజయవంతం చేయాలని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసులు, డిస్ట్రిక్ లీగల్ సర్వీసు కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు సూచించారు. బుధవారం సాయంత్రం డోన్ కోర్టు సముదాయ భవనం ఆవరణలో న్యాయవాదులు, పోలీసు అధికారులతో వారు విడివిడిగా సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌పై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉన్నత న్యాయ స్థానాలు ప్రజలకు సత్వర న్యాయసేవలు అందించాలనే ఉద్దేశంతో లోక్ అదాలత్‌లు ఏర్పాటు చేస్తున్నాయన్నారు. ప్రజలకు న్యాయ సేవలు అందించడంలో పోలీసులు, న్యాయవాదులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. న్యాయవాదులు, పోలీసు అధికారులు తమ పరిధిలోని కక్షిదారులకు లోక్ అదాలత్ లాభాలు వివరిస్తూ చైతన్యపరచాలని చెప్పారు. కక్షిదారులు రాజీకి సముఖత వ్యక్తం చేస్తే వాటిని వెంటనే లోక్ అదాలత్‌లో ప్రవేశ పెట్టాలని సూచించారు. సమావేశంలో డోన్ సబ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసు కమిటీ చైర్మన్ తంగమణి, ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ హనీషా, ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, డోన్ బార్ కౌన్సిల్ సభ్యులు, డోన్ సబ్ డివిజనల్ పరిధిలోని పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న జఫ్రుల్లా

అవుకు: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల శాతం పెంచాలని, దీనికి అనుగుణంగా వైద్యసిబ్బంది కృషి చేయాలని జిల్లా కో ఆర్డినేటర్ హాస్పిటల్ సర్వీసెస్ ఎస్ ఎండీ జఫ్రుల్లా సూచించారు. బధవారం మండల కేంద్రం అవుకులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం అవుకు సీహెచ్‌సీ, ఉప్పలపాడు పీహెచ్‌సీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో జఫ్రుల్లా మాట్లాడారు. మాతా శిశు మరణాల రేటు తగ్గించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అదేవిధంగా తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్, 108 వాహనాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రసవాల శాతాన్ని పెంచాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు వినోద్‌కుమార్, రవికుమార్, చాణక్య, కల్యాణ్, ఇంద్ర కల్యాణి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి స్వచ్ఛంద సంస్థలు చేయూత



చెక్కు అందజేస్తున్న ద్రోణాచలం సేవాసమితి సభ్యులు

డోన్ : పట్టణంలోని వైఎస్ నగర్‌కు చెందిన గిరి ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతిచెందగా, అతని భార్య శిరీష ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకుంది. కుటుంబ పెద్దను కోల్పోయిన శిరీష కుటుంబంలో ఇద్దరి పిల్లల పోషణ నిమిత్తం పట్టణంలోని పలు స్వచ్ఛంద సంస్థలు విరాళాలు సేకరించి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక షాదిఖాన ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో అర్బన్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్‌బీఐ సీనియర్ మేనేజర్ రఘు, పట్టణ ప్రముఖులు బచ్చు జయశీలన్ గుప్తాలు శిరీషకు ద్రోణాచలంసేవాసమితి సేకరించిన రూ.1.17లక్షల నగదును అందజేశారు. కార్యక్రమంలో సేవాసమితి వ్యవస్థాపకులు షాదిఖానా రాజు, సభ్యులు కరుణాకర్, పాణిపూరి మురళి, పాండు, గురుస్వామి, సుధాకర్, తాహెర్‌బాషా, సంజీవుడు తదితరులు పాల్గొన్నారు.

చదువులకు చేయూత

మూడవ తరగతి, ఒకటవ తరగతి చదువుతున్న గిరి, శిరీష దంపతుల కుమారుడు, కుమార్తెలు హర్షవర్ధన్, గీతామాధురిల చదువులకు అయ్యే ఖర్చును తాము భరిస్తామని హోంవిల్లా అధినేత ప్రశాంత్, అర్జున్‌రెడ్డి, సేవాసమితి సభ్యులు బచ్చు నాగరాజులు ముందుకు వచ్చారు. వీరిని సీఐ ప్రవీణ్ కుమార్ అభినందించారు.

అండగా నిలిచిన చేయూత ట్రస్టు

శిరీష కుటుంబానికి చేయూత ట్రస్టు సభ్యులు అండగా నిలిచారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో ట్రస్టు ద్వారా సేకరించిన రూ.48,200లను శిరీషకు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షులు రామానాయుడు, కోశాధికారి మీసేవ శ్రీను, అధ్యక్షులు వెంకటేష్, ఉపాధ్యక్షులు టైలర్ బాషా, సభ్యులు గుర్రం మధు, మాస్టర్ శ్రీను, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న చలం రెడ్డి

బేతంచెర్ల: నగర పంచాయతీలోని 20 వార్డులను దశలవారీగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసు కుంటున్నట్లు నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో చైర్మన్ చలం రెడ్డి అధ్యక్షతన నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా కాలనీల్లో చేపట్టే పనులు, చేసిన అభివృద్ధి పనులను కమిషనర్ రమేష్ బాబు వివరించారు. చలం రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని కాలనీల్లో సీసీ రోడ్లు డ్రైనేజీ కాల్వలు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నగర పంచాయతీలో పరిధిలో చేపట్టిన 30 లక్షలతో చేసిన అభివృద్ధి పనులకు, నూతనంగా చేపట్టే సుమారు రూ.2.50 కోట్ల పనులకు ప్రతిపాదనలు పంపుతూ సభ్యులు తీర్మానం చేశారు. తాగునీటి సమస్య ఉందని కౌన్సిలర్స్ సభ దృష్టికి తీసుకురాగా వర్షాభావ పరిస్థితుల కారణంగా బోరుబావుల్లో భూగర్భజలాలు తగ్గడంతో సమస్య తలెత్తిందని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. ఈద్గా కంపౌండువాల్ నిర్మాణానికి రూ. 10.50 లక్షలు కేటాయించడంతో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి నగర పంచాయతీ వైస్ చైర్మన్ పర్వీన్ ముస్లిం మైనార్టీల తరపున కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో కౌన్సిలర్లు మధు,కోట్ల మధు, షేక్ ముబీనా, హుస్సేన్‌బీ, నాగజ్యోతి, మహేశ్వరి, సునీల్,ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

కోవెలకుంట్ల: స్థానిక జ్యోతి విద్యానికేతన్ విద్యార్థులు జాతీయస్థాయి సూపర్‌సెవెన్ క్రికెట్ పోటీల కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సింధూరి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటి పాఠశాలకు చెందిన చంద్రమౌళీశ్వరరెడ్డి, శశాంక్, కార్తికేయరెడ్డి, సుదీప్‌రెడ్డిలు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వచ్చే నెల 2 నుంచి ఆరవ తేదీ వరకు ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.ఆ విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు కరస్పాండెంట్ సవిత్నాథ్‌రెడ్డి, వ్యా యామ ఉపాధ్యాయులు పరమేశ్వరరెడ్డి, సురేష్, పార్వతి, శృతి, తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

డోన్ వాసికి బంగారు పతకం



వీసీతో అవార్డు అందుకుంటున్న వి.ధర్మ పెద్దయ్య(ఫైల్)

కర్నూలు సిటీ: డోన్ మండలం చిన్న మల్కాపురం గ్రామానికి చెందిన వి. ధర్మ పెద్దయ్య ఎం.ఏ రూరల్ డెవలప్‌మెంట్‌లో గోల్డ్‌మెడల్ సాధించారు. 2015–17లో నాగార్జున యూనివర్సిటీలో పీజీ ఆర్‌డీ పూర్తి చేశారు. ఆ బ్యాచ్‌లో మొదటి స్థానంలో రావడంతో ఈ నెల 29న జరిగిన 39వ స్నాతకోత్సవంలో వర్సిటీ వీసీ పి.రాజశేఖర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నానని ధర్మ పెద్దయ్య బుధవారం తెలిపారు.

చెరువులకు హంద్రీనీవా కాలువ నుంచి ట్రయల్ రన్



ఉడుములపాడు చెరువుకు నీరు వదులుతున్న దృశ్యం

డోన్ టౌన్ : హంద్రీ నీవా కాలువ నుంచి చెరువులకు నీటిని మళ్లించేందుకు ఏర్పాటు చేసిన పైపులైన్ల పరిస్థితిపై నీటిపారుదల శాఖ గత రెండు రోజులుగా ట్రయల్ రన్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. డోన్ నియోజకవర్గంలోని 68 చెరువులకు హంద్రీ నీవా కాలువ నుండి నీటిని నింపేందుకు పైపులైను నిర్మాణం పనులు గత వేసవిలోనే పూర్తి చేశారు. ప్రస్తుతం వర్షా కాలంలో నీటిని చెరువులకు నింపేందుకు ట్రయల్ రన్ చేపట్టినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా రెండు రోజులుగా నంద్యాల జిల్లాలోనే అతి పెద్ద చెరువు అయిన వెంకటాపురం తుమ్మల చెరువు, బొంతిరాళ్ల గ్రామం ఎల్లారెడ్డి చెరువు, ఉడుములపాడు చెరువుతో పాటు పలు గ్రామాల్లో ఉన్న చెరువులకు నీటిని వదులుతూ ట్రయల్ రన్ చేపట్టారు. పైపులైను లీకేజీలు, నీటి ప్రెజర్ తదితర అంశాల పరిశీలన చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

జియారత్ వేడుకలకు ముస్తాబు

కోవెలకుంట్ల: మండలంలోని ఎం. గోవిందిన్నె మెట్ట మీద వెలసిన మీరావలి దర్గా జియారత్ వేడుకలకు ముస్తాబవుతోంది. మొహర్రం ముగిసిన 40 రోజున ప్రతిఏటా జార్తలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది మొహర్రం పండుగ ముగియగా గురువారం జియారత్ వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. దర్గా కమిటీ అధ్యక్షుడు సత్యరాజు ఆధ్వర్యంలో జియారత్ వేడుకలు జరుగనున్నాయి.

4న ఉపసర్పంచ్ ఎన్నిక

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక సెప్టెంబర్ 4వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ మేరకు వార్డు మెంబర్లకు సమాచారం అందజేశామన్నారు. స్పెషల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఉపసర్పంచ్‌ను మెజార్టీ సభ్యులు ఎన్నుకుంటారన్నారు. ఉప సర్పంచ్ ఎన్నికకు సంబంధించి అన్నీ ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



బాధితురాలికి చెక్కు అందజేస్తున్న దృశ్యం

ప్యాపిలి: మండల పరిధిలోని హుసేనాపురం గ్రామానికి చెందిన పుల్లమ్మకు బుధవారం డోన్ పట్టణంలోని మంత్రి స్వగృహంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేశారు. పుల్లమ్మ భర్త భూషన్న ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. అప్పట్లో వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద బాధిత కుటుంబానికి రూ. లక్ష చెక్కు వచ్చింది. మంత్రి పీఏ ఉమా మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో చెక్కును అందజేశారు. కార్యక్రమంలో హుసేనాపురం సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి, ఎంపీటీసీ నరసింహులు, మల్లేశ్వరరెడ్డి, శివారెడ్డి, చెన్నారెడ్డి మెట్టు విఘ్నేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు పరిశీలన



పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ అబ్దుల్ షఫీ

డోన్ టౌన్ : మండలంలోని ఎద్దుపెంట, కొత్తకోట గ్రామాల్లో చేపట్టిన పంట నమోదు కార్యక్రమాలను బుధవారం ఏఓ అబ్దుల్ షఫీ పరిశీలించారు. జియో కో ఆర్డినేట్స్ అనుసంధానం ద్వారా సాగు చేసిన పంటల వివరాలు, సర్వే నంబర్లు పక్కాగా నమోదు చేయాలని ఏఓ సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయా గ్రామాల రైతులతో ఏఓ మాట్లాడారు. వర్షాభావ పరిస్థితుల మూలంగా వేరు శనగ, ఆముదం, సజ్జ పంటలు ఎండుతున్నాయని, యూరియా లేదా 13–0–45 రకాన్ని నీటితో కలిపి పిచికారీ చేసి పైరును బెట్ట నుంచి కాపాడుకోవానలి సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు విజయ్‌కుమార్,దస్తగిరమ్మ గ్రామరైతులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న గుండం శేషిరెడ్డి



భూమిపూజ నిర్వహిస్తున్న వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి

బనగానపల్లె: మండలంలోని పలుకూరు గ్రామంలో రూ.15లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణానికి బుధవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అభివృద్ధి సంక్షేమబాటలో నడుస్తున్నారని, పక్కరాష్ట్రాలు మన వైపు చూస్తున్నాయన్నారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు భూపాల్‌రెడ్డి, అల్లె సురేష్‌రెడ్డి ఇంజినీరింగ్ అసిస్టెంట్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

డోన్: మండలంలోని ఎద్దుపెంట గ్రామంలో రూ.5లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి బుధవారం మండల వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి భూమిపూజ చేశారు. సర్పంచ్ బంగారు జయచంద్ర, ఉపసర్పంచ్ హరిక్రిష్ణ, వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్ భాస్కర్, నాయకులు రమణారెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చౌడేశ్వరిదేవికి పల్లకీ సేవ



అమ్మవారికి సహస్రదీపాలంకరణ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయం లో అమ్మవారికి బుధవారం ఆలయ కార్యనిర్వాహణాధికారి రామానుజన్ ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఉంచి ఆలయం చుట్టూ పల్లకీ సేవ, అనంతరం సహస్రదీపాలంకరణ కార్యక్రమాన్ని సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

శ్రీలక్ష్మీ హయగ్రీవ స్వామికి పూజలు

డోన్ టౌన్ : పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో వెలసిన శ్రీలక్ష్మీ హయగ్రీవ స్వామికి అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీ హయగ్రీవ జయంతిని పురస్కరించుకుని ఆలయ అర్చకులు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో భక్తులు స్వామి వారికి ఉదయం పంచామృత అభిషేకం, సాయంత్రం అర్చన, మహా నివేదన, మహా మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.